అంగన్‌వాడీ కేంద్రాలకు వసతి సమస్య

● కొన్ని నిర్మాణ దశలో..
మరికొన్ని భవనాలు అప్పగించక..



8లో

● వరి కోతలు ముమ్మరం ● కూలీలు దొరక్క అవస్థలు
● తడిసిమోపుడవుతున్న వ్యవసాయ ఖర్చులు ● రైతులపై అదనపు భారం

కూలీల కొరత.. ఖర్చుల మోత!





పాలకొండ మండలం వెలగవాడలో వరి కోతలు కోస్తున్న కూలీలు

వ్యవసాయ ఖర్చులు ఇలా..

ప్రస్తుతం జిల్లాలో ఎకరా కోతకు కూలీలు రూ.5 వేల నుంచి రూ.6 వేలు వరకు డిమాండ్ చేస్తున్నారు. కోత కోసిన పంటను కుప్ప వేసేందుకు అదే పొలంలో అయితే ఎకరాకు రూ.4 వేలు ఖర్చవుతుంది. సమీపంలో ఉన్న కల్లాలకు తరలించేందుకైతే వీటి ఖర్చు మరింత భారమవుతుంది. పంట నూర్పుడి యంత్రాలు అందుబాటులో ఉన్నా ఎకరాకు రూ.2 వేలు పైనే ఖర్చు అవుతుంది.



వరిపనలను కుప్పలుగా వేసిన దృశ్యం

పాలకొండ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి)

జిల్లా రైతులను కూలీల కొరత తీవ్రంగా వేధిస్తోంది. దీంతో పంట చేతికందే సమయంలో పడరాని పాట్లు పడుతున్నారు. సకాలంలో కోతలు కోసేందుకు, పంటను కల్లాలకు తరలించేందుకు కూలీలు దొరక్క నానా అవస్థలు పడుతున్నారు. వాస్తవంగా వలసల జిల్లాగా పేరొందిన జిల్లాలో వ్యవసాయ పనులకు వచ్చే వారి సంఖ్య రోజురోజుకూ గణనీయంగా తగ్గుతోంది. ఈ ప్రభావం వ్యవసాయ పనులపై పడుతోంది. ఈ ఏడాది ఖరీఫ్‌లో జిల్లా రైతులు సుమారు 2 లక్షలకు పైగా ఎకరాల్లో వరి సాగు చేశారు. ప్రస్తుతం ఈ పంట కోతకు సిద్ధం ఉంది. అయితే ఇందుకు అవసరమైన కూలీలు అందుబాటులో లేకపోవడంతో రైతులు తలలు పట్టుకుంటున్నారు. అందుబాటులో ఉన్న కూలీలను రోజువారీ ప్రాతిపదికన కాకుండా కాంట్రాక్ట్ పద్ధతిలో ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. దీంతో పంట కోత, మోత, నూర్పుకు ఇచ్చే మొత్తాలు రైతులకు తడిసిమోపుడవుతున్నాయి. మరోవైపు వాతావరణ మార్పులు కూడా అన్నదాతలను కలవరపెడుతోంది. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో తప్పనిసరి పరిస్థితుల్లో కూలీలు అడిగే మొత్తాలను వెచ్చించి వ్యవసాయ పనులు చేయిస్తున్నారు. మరి కొంతమంది రైతులు అందుబాటులో ఉన్న యంత్రాలను వినియోగించుకొని ఖరీఫ్ పనులను పూర్తి చేస్తున్నారు. ఇది కొంతవరకు గిట్టుబాటు అవుతున్నప్పటికీ జిల్లాలో అన్ని చోట్లా యంత్రాలను వినియోగించుకునే పరిస్థితి లేకుండా పోయింది.

అనువైన పరిస్థితులు లేక..

జిల్లా రైతులు పూర్వం నుంచి మోసు పద్ధతిలోనే వ్యవసాయాన్ని చేస్తున్నారు. యంత్ర పరికరాలను వినియోగించే అనువైన పరిస్థితి మన్యంలో కనిపించడం లేదు. ఇందుకు ప్రధాన కారణం అన్ని ప్రాంతాలకు అవసరమైన సాగునీరు సరఫరా కావడం లేదు. భౌగోళికంగా వ్యవసాయ భూములు వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా లేవు. ఉదాహరణకు తోటపల్లి ప్రాజెక్టు కింది భాగంలో ఉన్న జియ్యమ్మవలస, గరుగుబిల్లి మండలాలల్లో భూములకు పూర్తిస్థాయిలో సాగునీరు అందుతుంది. దీంతో ఆయా ప్రాంత రైతులు వరి కోత కోసిన తర్వాత రబీ కింద అపరాల సాగు చేస్తుంటారు. పాలకొండ, వీరఘట్టం మండలాల్లో ఆ పరిస్థితి లేదు. యంత్రంతో కోత కోస్తే ఆ తర్వాత అపరాలను జల్లే అవకాశం ఉండదు. వీరికి వరి పంట కోత అనంతరం సాగునీరు అందడం గగనమే. దీంతో చేసేది లేక ప్రాజెక్టు శివారు ప్రాంత రైతులు వరి పంట కోత దశలో ఉన్నప్పుడు మినుము, పెసర, కట్టెజనుం ఇతర విత్తనాలను జల్లుతారు. అలా జల్లిన వ్యవసాయ భూముల్లో యంత్రాల ద్వారా వరి పంట కోత కోస్తే అపరాల పంట నష్టం వాటిల్లుతుంది. ఇటువంటి పరిస్థితుల్లో రైతులు యంత్ర పరికరాలను పూర్తిస్థాయిలో వినియోగించలేకపోతున్నారు. దీనిపై పాలకొండ ఏవో ప్రసాదరావును వివరణ కోరగా.. 'వచ్చే ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన యంత్ర పరికరాలు సరఫరా చేసేందుకు వీలుగా ప్రతిపాదిస్తాం. నిధులు మంజూరైతే యంత్ర పరికరాలను రాయితీలో అందిస్తాం.' అని తెలిపారు.

బోటు షికారు ఎప్పుడు?

● తోటపల్లి ప్రాజెక్టులో గుర్రపు డెక్క తొలగించని వైనం
● నిరాశలో పర్యాటకులు



తోటపల్లి ప్రాజెక్టులో ఒడ్డుకు చేరిన గుర్రపు డెక్క

గరుగుబిల్లి, నవంబరు16(ఆంధ్రజ్యోతి): తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు పరిధిలో బోటు షికారుకు మోక్షమెప్పుడో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో పర్యాటకులు నిరాశ చెందుతున్నారు. పిక్నిక్‌ల సీజన్ కావడంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారు బోటు షికారు చేయలేక వెనుదిరుగుతున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టు ప్రాంతంలో గుర్రపు డెక్క కొంతమేర ఒడ్డుకు చేరుకుంది. దానిని తొలగించడంపై అధికారులు దృష్టి సారించడం లేదు. దీంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వాస్తవంగా గతంలో బోటు షికారు నిర్వహించినా గుర్రపు డెక్క కారణంగా పలు సమస్యలు ఎదురయ్యాయి. దీంతో తాటిపూడి ప్రాజెక్టుకు ఇక్కడి బోట్లును తరలించారు. ప్రస్తుతం రెండు బోట్లు తోటపల్లి ప్రాజెక్టు పరిధిలోని గుర్రపు

(మిగతా 8వ పేజీలో...)

ఉచిత న్యాయ సేవలు పొందాలి
● ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయాధికారి బబిత
7లో

గుర్లలో స్టీల్ ప్లాంటు
● ఏర్పాటుకు ఉత్తర్వులు
7లో
● మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ముగిసిన రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

కొరియా సమస్యపై ఆలోచించండి
● ఒడిశా ముఖ్యమంత్రిని కోరిన మంత్రి సంధ్యారాణి
8లో



ఆ కార్డుల రద్దుకు రంగం సిద్ధం!

● పేదల ముసుగులో కొందరు సంపన్నులు
● రేషన్ తీసుకోరు.. ఈకేవైసీ చేయించుకోరు..
● సంక్షేమ పథకాలకు మాత్రం అర్హులు
● ఇప్పటివరకు స్మార్ట్‌కార్డులు తీసుకోని వైనం
● ఇటువంటి వారిపై అధికారుల దృష్టి

పార్వతీపురం, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): పేదల ముసుగులో రేషన్‌కార్డులు పొందిన వారిపై జిల్లా అధికారులు దృష్టి సారించారు. ప్రతినెలా రేషన్ విడిపించని వారు, ఈకేవైసీ చేయించుకోని వారి కార్డులను రద్దు చేయనున్నట్లు తెలుస్తోంది. వాస్తవంగా ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలకు రేషన్‌కార్డులు తప్పనిసరి. ఇందుకోసం జిల్లాలో ఎంతోమంది సంపన్నులు రేషన్‌కార్డులు పొందారు. ఎన్నో ఏళ్లుగా వారి ఆటలు సాగుతున్నా.. పట్టించుకునే వారే కరువయ్యారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్‌కార్డులు ప్రవేశపెట్టడం, ఈకేవైసీ తప్పనిసరి చేయడంతో కొంతమంది ఆందోళన చెందుతున్నారు. తమ బండారం ఎక్కడ బయటపడుతుందోనని టెన్షన్ పడుతున్నారు. దీనిలో భాగంగా జిల్లాలో కొంతమంది ఇప్పటివరకు స్మార్ట్‌కార్డులను కూడా తీసుకోలేదు. ఇంకా పాత కార్డులనే వినియోగిస్తూ సంక్షేమ పథకాలు పొందుతున్నారు.



ఇదీ పరిస్థితి..

● జిల్లాలో 2,58,936 రేషన్‌కార్డులు ఉన్నాయి. ఇందులో ఇప్పటివరకు 17,150 రేషన్‌కార్డులకు సంబంధించి ఈకేవైసీ పూర్తికాలేదు. నెలలు గడుస్తున్నా ఆయా కార్డులకు సంబంధించిన వారు ముందుకు రావడం లేదు. వాస్తవంగా ప్రభుత్వం స్మార్ట్‌కార్డులు జారీ చేసిన తర్వాత ఈకేవైసీ తప్పనిసరి చేసింది. అయితే ఈ ప్రక్రియ జిల్లాలో ఇంకా పూర్తి కాలేదు.

● ప్రతినెలా 90 నుంచి 92 శాతం మంది మాత్రమే రేషన్ తీసుకుంటున్నారు. మిగిలిన వారు రేషన్ తీసుకోవడం లేదు. కాగా జిల్లాలో 17,50 రేషన్‌కార్డులకు సంబంధించి వారు ఈకేవైసీకి ఇదిగో.. అదిగో అంటూ కాలయాపన చేస్తున్నారు. రేషన్‌కార్డు ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వైద్య సేవలు పొందుతున్న వారు ఈకేవైసీకి మాత్రం ముందుకు రాకపోవడం వెనుక అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

● ఇదిలా ఉండగా రేషన్ కార్డుదారుల్లో వలసలు వెళ్లిపోయిన వారు, మరికొంతమంది మృతులు

(మిగతా 8వ పేజీలో...)



గుమ్మలక్ష్మీపురం: కుశ జలపాతంలో జలకాలాడిన కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

సండే సందడి

● కిటకిటలాడిన పర్యాటక ప్రదేశాలు



మెట్టుగూడ జలపాతం వద్ద మినీ స్విమ్మింగ్ పూల్‌లో మహిళలు, చిన్నారుల కేరింత

సీతంపేట రూరల్, నవంబరు16(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఏజెన్సీలో పర్యాటక ప్రాంతాలు ఆదివారం కిటకిటలాడాయి. ఆడలి, జగతిపల్లి వ్యూ పాయింట్లు, మెట్టుగూడ, సున్నపుగెడ్డ జలపాతాలు, సీతంపేట ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్‌లకు సందర్శకులు పోటెత్తారు. కుటుంబ సభ్యులతో కలిసి సాయంత్రం వరకూ సరదాగా గడిపారు. మహిళలు, చిన్నారులు, యువకులు ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపారు. జలపాతాల వద్ద స్నానాలు చేసి సెల్ఫీలు దిగారు. ఎన్టీఆర్ పార్క్‌లో ఏర్పాటు చేసిన పలు సాహస క్రీడల్లో పాల్గొని ఆనందంగా గడిపారు. మొత్తంగా అంతటా సండే సందడి నెలకొంది. పర్యాటక ప్రదేశాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు రక్షణ చర్యలు చేపట్టారు.

కోటదుర్గమ్మను తాకిన సూర్య కిరణాలు
8లో

ఘనంగా సహస్ర జ్యోతిర్లింగార్చన
8లో

ఎన్నాళ్లిలా?
8లో
● నిధులున్నా.. వెంటాడుతున్న స్థల సమస్య
● పరాయి పంచనే మండల విద్యావనరుల కార్యాలయం

● ముందే పుడుతున్న శిశువులు ● వారి ఆరోగ్యంపై జాగ్రత్తలు అవసరం
● అన్ని సౌకర్యాలు ఉండే ఆస్పత్రిలో చేరితే మరింత సేఫ్ ● నేడు వరల్డ్ ప్రీ మెచ్యూరిటీ డే

నెలలు నిండకున్నా.. కనుపాపలై వెలగాలి



పార్వతీపురం జిల్లాకేంద్రాసుపత్రిలో చికిత్స పొందుతున్న శిశువులు

రాజాం రూరల్/పాలకొండ/బెలగాం, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): నెలలు నిండకుండా శిశువులు జన్మించడం ప్రస్తుత రోజుల్లో సాధారణంగా మారింది. ఈ పరిస్థితిలో వారి ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకుంటే మిగతా వారిలా ఆరోగ్యవంతులవుతారన్నది వైద్యుల మాట. నెలలు నిండకుండా.. అంటే 23, 24, 25 27, 34 ఇలా.. ఆయా నెలల్లో పుట్టే పిల్లలందరినీ ప్రీ మెచ్యూర్ బేబీగా పరిగణిస్తారు. 37 వారాల కంటే ముందు పుట్టే పిల్లలు ప్రీమెచ్యూర్ కోవలోకి వస్తారు. 28 వారాల లోపు పుట్టే పిల్లలు ఎక్స్‌ట్రీమ్ ప్రి మెచ్యూర్ కోవకు చెందుతారు. ఇలాంటి శిశువులు పుడుతునే సమస్యలు వెంట తెచ్చుకోవడంతో పాటు ఎదిగే క్రమంలో కూడా ఎన్నోరకాల సమస్యలకు లోనవుతారు. తల్లి గర్భం నుంచి అత్యంత తక్కువ సమయంలోపే బయటపడే ఎక్స్‌ట్రీమ్ ప్రి మెచ్యూర్ పిల్లలకు సమస్యలు మరింత ఎక్కువగా ఉంటాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. నెలలు నిండకుండా శిశువులు జన్మిస్తే వారు తల్లి నుంచి పొందే సరైన పోషణ కోల్పోతారు. ఈ శిశువుల్లో న్యూరో డెవలప్‌మెంట్ అనేది అసాధారణంగా ఉంటుంది. ఇలాంటి శిశువులు పుట్టిన క్షణాల నుంచి వైద్య సహాయం ఎంతో అవసరం. నేడు వరల్డ్ ప్రీ మెచ్యూరిటీ డే పురస్కరించుకుని ప్రత్యేక కథనం.



పాలకొండ ఏరియా ఆసుపత్రిలో ప్రత్యేక వార్డు

ఎందుకిలా..?

నెలలు నిండకుండా శిశువు జన్మించేందుకు తల్లి, బిడ్డ.. ఇద్దరిలోనూ లోపం ఉండే అవకాశాలున్నాయి. గర్భిణీకి బీపీ, షుగర్, మూత్రనాల, మూత్రపిండాల ఇన్ఫెక్షన్ ఉన్నప్పుడు ప్రసవానికి ముందే ఉమ్మనీరు కోల్పోవడం వంటి సందర్భాల్లో నెలలు నిండకుండా శిశువుకి జన్మనిచ్చే అవకాశాలే బోలెడని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. కృత్రిమ గర్భధారణలో సైతం ఇలాంటి జననాలు సంభవించే అవకాశాలూ లేకపోలేదు. కవల పిల్లలకు జన్మనిచ్చే సమయంలో కూడా నెలలు నిండకుండా శిశువులు పుట్టే వీలుంది.

ఇలా చేయాలి..

నెలలు నిండకుండా పుట్టే శిశువులకు మొదటిగంట కీలకం. పుట్టిన (మిగతా 8వ పేజీలో..)

కూలితేగానీ కదలరా?

● శిథిలావస్థలో కురసంగి-గెద్దకోల వంతెన
● నిలిచిన ఆర్టీసీ బస్సు సర్వీసు
● గిరిజనుల రాకపోకలకు అవస్థలు

సీతంపేట రూరల్, నవంబరు16(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఏజెన్సీలో కురసంగి-గెద్దకోల గ్రామాల మధ్య ఉన్న వంతెన శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి. మొంథా తుఫాన్ ప్రభావంతో ఇటీవల కురిసిన వర్షాలకు రక్షణగోడ కూలింది. దీంతో పాలకొండ నుంచి అంటికొండకు వెళ్లే ఆర్టీసీ సర్వీసును నిలిపేశారు. ఈ నేపథ్యంలో ఆరు గిరిజన గ్రామాల ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. విద్యార్థులు, గిరిజన రైతులకు రవాణా కష్టాలు మొదలయ్యాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియక బిక్కుబిక్కుమంటూ వాహన చోదకులు, గిరిజనులు ప్రయాణించాల్సి వస్తోంది. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి బ్రిడ్జ్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని అంటికొండ, పెద్దగూడ, కురసంగి, అచ్చెబ,

(మిగతా 8వ పేజీలో...)



గెద్దకోల-కురసంగి గ్రామాల మధ్యలో ఉన్న వంతెన ఇలా..

వయోవృద్ధుల సంక్షేమ శాఖ

ఇన్‌చార్జి ఏడీగా కూర్మనాథ్

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి):జిల్లా వయో వృద్ధులు సంక్షేమ శాఖ ఇన్‌చార్జి ఏడీగా జిల్లా పర్యాటక శాఖ అధికారి కూర్మనాథ్‌ను నియమిస్తూ కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారు. ఇక్కడ పని చేసిన ఏడీ ఆశయ్య దీర్ఘకాలిక సెలవు పెట్టడంతో ఇన్‌చార్జి బాధ్యతలను కూర్మనాథ్‌కు అప్పగించారు. ఈయన విజయనగరం, అనకాపల్లి జిల్లాలకు ఏడీగా విధులు నిర్వహించనున్నారు.

పదోన్నతులు కల్పించాలి

విజయనగరం దాసన్నపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్లానింగ్ సెక్రటరీలకు పదోన్నతులు కల్పించాలని ఆ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పొట్నూరి శ్రీకాంత్ కోరారు. ఆదివారం అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్లానింగ్ సెక్రటరీల సమస్యలు, పదోన్నతులకు రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు కోన వెంకటేశ్వరరావు మద్దతు ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు రాజేష్, అశోక్, చైతన్యసాయి, ప్రియాంక, మణికంఠ, సందీప్, మోహన్ పాల్గొన్నారు.

సేవలను విస్తృతం చేస్తాం

విజయనగరం దాసన్నపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సెక్యూరిటీ, సేఫ్టీ సేవలను విస్తృతం చేస్తామని ఐఎఫ్ఎస్‌సీ వ్యవస్థాపకుడు శ్రీను మహంతి అన్నారు. ఆదివారం నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో ఫైర్ సెక్యూరిటీ సర్వీస్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులతో పాటు ఫైర్ సేఫ్టీ అధికారులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ కార్యవర్గం

గజపతినగరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎఫ్ఐ మండల కమిటీ నూతన అధ్యక్షుడిగా పి.గౌరి, కార్యదర్శిగా ఎస్.సతీష్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు జిల్లా అధ్యక్షుడు డి.రాము ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరితో పాటు 16 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నట్లు చెప్పారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించే దిశగా అలుపెరగని పోరాటాలు సాగిస్తామన్నారు. ఆరేళ్ల కిందట మంజూరైన డిగ్రీ కళాశాలకు నేటికీ సొంతభవనం లేని దుస్థితి నెలకొందన్నారు. పీజురియంబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

లక్కవరపుకోట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎస్.కోట నియోజవర్గ పరిధిలోని ఐదు మండలాల్లో 65 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు ఇన్‌చార్జి ఏడీ హరికృష్ణ తెలిపారు. జామి మండలంలో 20, కొత్తవలసలో ఆరు, ఎల్.కోటలో 12, ఎస్.కోటలో 14, వేపాడలో 13 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. నియోజకవర్గంలో 53,700 ఎకరాల్లో లక్షా 25వేల 815 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతాయని, లక్షా 2 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. రైతులు ధాన్యాన్ని విక్రయించుకోవాలని కోరారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ అన్యాయం

నెల్లిమర్ల, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం అన్యాయమని ఎమ్మెల్సీ పీవీ సూర్యనారాయణరాజు అన్నారు. ఆదివారం వివిధ గ్రామాల్లో జరిగిన కోటి సంతకాల కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తే పేద విద్యార్థులు తీవ్రస్థాయిలో నష్టపోతారని అన్నారు. కార్యక్రమంలో వైసీపీ కార్మిక విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి దవళ లక్ష్మణరావు, మొయిద సర్పంచ్ అట్టాడ కృష్ణ, వైసీపీ నాయకులు జమ్ము సూర్యసత్యం, చనమల్ల గౌతమి, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి సత్యసాయి జయంత్యుత్సవాలు

రాజాం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శత జయంత్యుత్సవాలను ఈ నెల18 (మంగళవారం) నుంచి 23 వరకు నిర్వహించనున్నట్లు రాజాం సత్యసాయి సేవాసమితి కన్వీనర్ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. 18న కొండంపేటలో పల్లకీ సేవ, 19న మహిళా దినోత్సవం, 20న సామూహిక సాయివ్రతాలు, 22న ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు పండ్లు, రొట్టెలు, పాలు పంపిణీ, 23న రాజాం సాయిమందిరంలో అన్నదానం, వస్త్ర దానం నిర్వహించనున్నట్లు చెప్పారు.

జిల్లాకు స్టీల్ ప్లాంటు

- గుర్లలో ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు
- సీఐఐ సదస్సు విజయవంతం
- మంత్రి కొండపల్లి శ్రీనివాస్


మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్, చిత్రంలో ఎంపీ కలిశెట్టి

విజయనగరం రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్టీల్‌ప్లాంటు ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం రాత్రి పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గుర్లలో స్టీల్‌ప్లాంటును ఏర్పాటు చేసేందుకు జిల్లా ప్రజా ప్రతినిధులంతా ఉమ్మడిగా నిర్ణయించి, ప్రభుత్వానికి అభిప్రాయం తెలియజేశామన్నారు. స్టీల్‌ప్లాంటుతో జిల్లాలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మరింతగా పెరుగుతాయన్నారు. ముఖ్యంగా వలసలను నివారించవచ్చునన్నారు. 'విశాఖపట్నంలో సీఐఐ సదస్సు విజయవంతంగా జరిగింది. రూ.13 లక్షల కోట్లు వరకూ పెట్టుబడులు వచ్చాయి. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి. దీని ద్వారా సూపర్ సిక్స్ హామీల్లో ఒకటైన 20 లక్షల ఉద్యోగాల కల్పన సాధ్యమవుతుంది. రాష్ట్రానికి విస్తృతంగా పెట్టుబడులు తెచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న కృషి ప్రశంసనీయం. ప్రతిపక్ష పార్టీ నాయకులు ఏదోఒకటి విమర్శిస్తుంటారు. సీఐఐ సదస్సు గురించి విమర్శలు తప్పకుండా చేస్తారు. ఇటువంటి వారు ఒక్కసారి ఆలోచన చేసుకోవాలి. గతంలో జరిగిన సీఐఐ సదస్సుకి, ప్రస్తుతం జరిగిన సదస్సుకి తేడా గమనించాలి.' అని మంత్రి అన్నారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ.. రాష్ట్రానికి పెట్టుబడుల సాధనే లక్ష్యంగా పారిశ్రామిక వేత్తలతో నిర్వహించిన సీఐఐ సదస్సు విజయవంతం అయిందన్నారు. ఇది సీఎం చంద్రబాబు ఘనతేనన్నారు. రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మరింత విస్తృతంగా పెరగనున్నాయని అన్నారు. అనంతరం సీఐఐ సదస్సు విజయవంతం కావడంపై కేక్ కేట్ చేశారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు కర్రోతు బంగార్రాజు, కడగల ఆనందకుమార్, పి.రాజేష్‌వర్మ, మక్కువ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్

ఓవరాల్ చాంపియన్‌గా విజయనగరం

- ముగిసిన పోటీలు
- అంతర్జాతీయ క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకోవాలి
- ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు



విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

నెల్లిమర్ల, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కొండవెలగాడలో మూడురోజులపాటు నిర్వహించిన 12వ రాష్ట్ర స్థాయి మెన్ అండ్ ఉమెన్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తాచాటారు. ఉమెన్, మెన్ సబ్ జూనియర్, జూనియర్, సీనియర్స్ విభాగాల్లో ఓవరాల్ చాంపియన్‌గా నిలిచారు. ఉమెన్స్ విభాగంలో బెస్ట్ వెయిట్ లిఫ్టర్‌గా కొండవెలగాడ క్రీడాకారిణి సుస్మిత నిలిచారు. మెన్స్ విభాగంలో కడప జిల్లాకు చెందిన రవిశంకర్ బెస్టు లిఫ్టర్‌గా సత్తా చాటారు. విజేతలకు ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఏపీ మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు, వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి నీలంశెట్టి లక్ష్మి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఎంపీ కలిశెట్టి మాట్లాడుతూ.. అంతర్జాతీయ క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకొని రాణించాలని అన్నారు. త్వరలో కొండవెలగాడలోని జిమ్‌ని పరిశీలించి అన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ముందుగా ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారిణి సత్యజ్యోతికి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కడగల ఆనంద్‌కుమార్, నగర పంచాయతీ అధ్యక్షుడు లెంక అప్పలనాయుడు, నాయకులు దంతులూరి అజయ్‌బాబు, మొయిద సత్యనారాయణ, వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా ప్రతినిధులు అట్టాడ లక్ష్మంనాయుడు, చల్లా రాము, వల్లూరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమ్మెబాట

- పంచాయతీల్లో పేరుకుపోతున్న చెత్త


గజపతినగరం మార్కెట్‌లో పేరుకుపోయిన చెత్త

గజపతినగరం,నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గత రెండు రోజులుగా పారిశుధ్య కార్మికులు సమ్మె బాట పట్టారు. దీంతో పంచాయతీల్లో చెత్త పేరుకుపోతుంది. గజపతినగరం, పురిటిపెంట గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులకు రెండు నెలలుగా వేతనాలు అందకపోవడంతో సీఐటీయూ ఆధ్వర్యంలో వారు సమ్మె చేస్తున్నారు. రెండు రోజులుగా విధులకు హాజరుకాకపోవడంతో పారిశుధ్య పనులు జరగడం లేదు. దీంతో పలు రోడ్లపై చెత్త నిల్వలు పేరుకుపోయాయి. డ్రైనేజీలు మురుగుతో నిండిపోతున్నాయి. దోమలు స్వైర విహారం చేస్తుండడంతో ఎటువంటి రోగాలబారిన పడాల్సి వస్తుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ పాలకులు, అధికారులు స్పందించి పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని రెండు పంచాయతీల ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఈవోపీఆర్‌డీ జనార్దనరావును వివరణ కోరగా.. జీతాలకు సంబంధించి బిల్లు పెట్టామని, సోమవారం నుంచి విధులకు హాజరుకావాలని కార్మికులకు సూచించామని తెలిపారు.

నిర్వాసితుల సమస్యల పరిష్కారంలో విఫలం


మాట్లాడుతున్న నాయకులు

భోగాపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): భోగాపురం ఎయిర్‌పోర్ట్ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం ఎయిర్‌పోర్టు నిర్వాసిత ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం భోగాపురంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఎయిర్‌పోర్టు నిర్మాణం ప్రారంభమై పదేళ్లు కావస్తున్నా నిర్వాసితుల సమస్యలు ఇంకా పరిష్కారం కాలేదన్నారు. ఆర్అండ్ఆర్ కాలనీలో మౌలిక సౌకర్యాలు కల్పనలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఎకనామికల్ కారిడార్ పేరుతో మరో 5వేల ఎకరాల భూమిని లాగేసుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి టీవీ రమణ, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.శ్రీనివాసు, జి.అప్పారావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు, సీఐటీయూ నాయకుడు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి భూపాలరాజపురం సర్పంచ్ రాజీనామా

దత్తిరాజేరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): భూపాలరాజపురం వైసీపీ సర్పంచ్ నేరెడుబిల్లి గురునాయుడు ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు ఆదివారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పార్టీ కోసం ఎన్నో ఏళ్లుగా కష్టపడుతున్నానని, కానీ పార్టీ నుంచి ఎలాంటి సహాయ సహకారాలు తనకు అందడం లేదన్నారు. పార్టీలోని కొంత మంది నేతలతో ఆర్థికంగా, వ్యక్తిగతంగా ఇబ్బందులు పడ్డానని, ఇదే విషయాన్ని పార్టీ మండల పెద్దల వద్ద, మాజీ ఎమ్మెల్యే అప్పలనర్సయ్య దృష్టికి తెచ్చినప్పటికీ పట్టించుకోలేదన్నారు. తాను ఇంటి వద్ద లేని సమయంలో కొందరు వచ్చి తన కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ సభ్యత్వానికి మాత్రమే రాజీనామా చేస్తున్నానని, గ్రామ సర్పంచ్‌గా కొనసాగుతూ ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు. తదుపరి భవిష్యత్ కార్యాచరణ త్వరలో వెల్లడిస్తానన్నారు. రాజీనామా లేఖను పార్టీ మండల అధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడికి అందజేస్తానని తెలిపారు.

ఉచిత న్యాయ సేవలు పొందాలి

- జిల్లా ప్రధాన న్యాయాధికారి బబిత


మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి బబిత

భోగాపురం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఉచితంగా న్యాయ సేవలు పొందాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎం.బబిత అన్నారు. నందిగాం గ్రామంలో ఆదివారం నిర్వహించిన న్యాయ సలహా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆర్థిక స్తోమత లేని ప్రజలు ఉచిత న్యాయ సలహాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. చిన్న చిన్న విషయాలకు తగాదాలకు పోకూడదన్నారు. సీనియర్ సిటిజన్స్ ఉచిత న్యాయసేవలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కక్షిదారులు కేసులు రాజీపరచుకునే విధంగా అవగాహన పొందాలన్నారు. చట్టం, శిక్షలు, తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయాధికారులు, సీఐ దుర్గాప్రసాదరావు, ఎస్ఐ పాపారావు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్‌కు సహకారం అందిస్తాం


పీఏసీఎస్ ఛైర్మన్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

శృంగవరపుకోట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రెడ్ క్రాస్ సొసైటీకి ప్రభుత్వం తరపున సహకారం అందిస్తామని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. ఆదివారం స్థానిక ఓ కల్యాణ మండపంలో రెడ్‌క్రాస్ సభ్యులు.. పీఏసీఎస్ ఛైర్మన్‌గా ఎంపికైన గొర్రిపాటి సింహాచలం నాయుడును సన్మానించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎస్.కోట రెడ్‌క్రాస్ సబ్ బ్రాంచ్ ఛైర్మన్‌గా స్త్రీ వైద్య నిపుణురాలు పొట్నూరు వరలక్ష్మి వ్యవహరించడం అభినందనీయమన్నారు. గిరిజన గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సభ్యులు దొడ్డి సూర్యారావు, శ్రీనాథుల వెంకన్నబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అదితిని కలిసిన నాగవంశ కార్పొరేషన్ డైరెక్టర్



విజయనగరం రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నాగవంశ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎన్నికైన బోని కుమార్ ఆదివారం ఎమ్మెల్యే అదితి గజపతిరాజుని మర్యాదపూర్వకంగా ఆమె నివాసంలో కలిశారు. తనకు ఈ బాధ్యతలు అప్పగించడంపై మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే అదితి, పార్టీ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. నాగవంశం కుల సంక్షేమానికి, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. బోని కుమార్‌కు జిల్లా శిష్టకరణ సంఘం అధ్యక్షుడు ఎంపీజీ ఈశ్వరరావు అభినందనలు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య


భీమయ్య (ఫైల్)

సీతంపేట రూరల్, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పులిపుట్టి పంచాయతీ పరిధిలోని ఆర్అండ్ఆర్ కాలనీకి చెందిన లిమ్మక భీమయ్య (55) ఆర్థిక ఇబ్బందులతో ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై సీతంపేట ఇన్‌చార్జి ఎస్ఐ మస్తాన్ అందించిన వివరాల మేరకు.. ఆర్అండ్ఆర్ కాలనీకి చెందిన లిమ్మక భీమయ్య కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. ఆదివారం ఆవులను మేతకు తీసుకువెళ్లిన భీమయ్య పులిపుట్టి, సుందరయ్యగూడ గ్రామాల మధ్య జీడితోటలో ఉరి వేసుకున్నాడు. అయితే ఆవులను మేతకు తీసుకువెళ్లిన భర్త ఎంత సమయమైన ఇంటికి రాకపోవడంతో భార్య భాగ్యలక్ష్మి భీమయ్యను వెతుక్కుంటూ తోటలోకి వెళ్లింది. అక్కడ చెట్టుకు ఉరివేసుకున్న భర్తను చూసి కేకలు వేసింది. దీంతో సమీపంలో ఉన్న గ్రామస్థులు వచ్చి పోలీసులకు సమాచారం అందజేశారు. మృతుడికి కుమారుడు రాము ఉన్నారు. మృతుడి భార్య భాగ్యలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇన్‌చార్జి ఎస్ఐ మస్తాన్ కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

మహిళ హత్య కేసు దర్యాప్తు ముమ్మరం

- ఇంకా నిర్వహించని పోస్టుమార్టం

కొత్తవలస, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వియ్యంపేట గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగిన దూది రాము(59) అనే మహిళ హత్యకు సంబంధించి పోలీసులు దర్యాప్తు ముమ్మర చేస్తున్నారు. శవ పంచనామా ప్రక్రియ పూర్తయ్యేసరికి శనివారం సాయంత్రం అయింది. దీంతో రాము మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం శృంగవరపుకోట ఆస్పత్రికి తరలించడం ఆలస్యమైంది. అయితే, ఆదివారం సెలవు దినం కావడంతో పోస్టుమార్టం జరగలేదు. పోస్టుమార్టం నివేదిక కోసం పోలీసులు ఎదురుచూస్తున్నారు. రాము హత్యకు సంబంధించి అన్ని కోణాల్లో దర్యాప్తును కొనసాగిస్తున్నట్టు సీఐ షణ్ముఖరావు తెలిపారు. ఆమెను బంగారం కోసమే హత్య చేశారా? లేక మరేదైనా కారణం ఉందా? అనే విషయాలపై దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. అనుమానితులను గుర్తించి వారిని తీసుకొచ్చి విచారణ చేస్తున్నట్టు తెలిసింది. ఈ హత్యను తెలిసిన వారే చేశారనే అనుమానాలు పోలీసులు వ్యక్తం చేస్తున్నారు. రెండు మూడు రోజుల్లో కేసును ఛేదిస్తామని చెబుతున్నారు.

అనంతగిరిలో రోడ్డు ప్రమాదం

- ఎస్.కోట ఆస్పత్రిలో క్షతగాత్రులకు చికిత్స


ఎస్.కోట ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

శృంగవరపుకోట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలంలో ఆదివారం రోడ్డు ప్రమాదం జరిగింది. గాయపడిన వారిని ఎస్.కోట ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. విశాఖపట్నం జిల్లా అరిలోవకు చెందిన 16 మంది అనంతగిరి మండలం ఎన్ఆర్‌పురం వేంకటేశ్వర స్వామి ఆలయానికి వచ్చారు. దర్శనం అనంతరం తాటిపూడి రిజర్వాయర్‌కు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో వీరి వాహనం బోల్తాపడింది. ఈ ఘటనలో 11 మంది గాయపడ్డారు. వీరిని ఎస్.కోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇద్దరి తలకు బలమైన దెబ్బలు తగిలి పరిస్థితి విషమంగా ఉండడంతో వారిని విశాఖపట్నం పంపించారు.

పశుగ్రాసం నాశనం

శృంగవరపుకోట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోటలో పశుగ్రాసాన్ని గుర్తు తెలియని వ్యక్తులు నాశనం చేశారు. శృంగవరపుకోటకు చెందిన రైతులు అప్పారావు, శ్రీనివాసరావు ఎకరా పొలంలో పశుగ్రాసం పెంచుతున్నారు. దీనిపై శనివారం రాత్రి దుండగులు గడ్డిమందును చల్లడంతో పచ్చగడ్డంతా మాడిపోయింది. పశువులు తినేందుకు పనికిరాకుండా పోయిందని రైతులు లబోదిబోమంటున్నారు. ఆస్తిలో వాటా కోసం గొడవపడుతున్న బంధువు పిల్లలు ఈ పని చేసి ఉంటారని వారు అనుమానిస్తున్నారు.

కల్లేపల్లి-రేగలో వైద్య శిబిరం

లక్కవరపుకోట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లేపల్లి-రేగ గ్రామంలో విశ్వమంథా ట్రస్టు ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. 286 మందికి వైద్యులు వివిధ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. 132 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 112 మందికి కళ్లద్దాలు అవసరమని, 16 మందికి ఆపరేషన్ అవసరమని వైద్యులు గుర్తించారు. వెయ్యి మంది పేదలకు వస్త్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షులు మంథా అమ్మాజీ, కార్యదర్శి ఎంఎల్.శ్రీనివాసరావు, సభ్యులు, మాజీ సర్పంచ్ యడ్ల ఈశ్వరరావు, గ్రామ పెద్దలు విశప్పలు, రావాడ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పొనుగుటివలసలో అన్నదానం

రాజాం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలోని పొనుగుటివలస గ్రామంలో ఆదివారం అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. కార్తీకమాసం సందర్భంగా శివస్వాములు, గ్రామస్థుల సహకారంతో ఐదువేల మందికి అన్నదానం చేశారు. వస్త్రపురికాలనీ భగత్‌సింగ్ వీధిలో రెండువేల మందికి అన్నదానం నిర్వహించారు

జిందాల్ నిర్వాసితుల వినూత్న నిరసన


మెడకు ఉరితాళ్లు తగిలించుకుని జిందాల్ నిర్వాసితుల నిరసన

ఎస్.కోట రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తమ భూములు వెనక్కి ఇప్పించాలని కోరుతూ బొడ్డవర గ్రామం వద్ద జిందాల్ నిర్వాసితులు చేపడుతున్న నిరసన కార్యక్రమం ఆదివారం 155వ రోజుకు చేరింది. తమకు న్యాయం చేయకపోతే ఉరే దిక్కు అని ఉరితాళ్లను మెడలో వేసుకొని వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. జిందాల్ నుంచి తమ భూములను వెనక్కి ఇప్పించి, తిరిగి భూసేకరణ చేసి కంపెనీలు ఏర్పాటు చేయాలని కోరారు. వీరికి జిల్లా రైతుసంఘనేత చల్లా జగన్ మద్దతు తెలిపారు.

ప్రజావ్యతిరేక విధానాలను మానుకోవాలి

- ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ పండా



సదస్సులో మాట్లాడుతున్న గణేష్‌పండా

విజయనగరం దాసన్నపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా, కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలను మానుకోవాలని ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ పండా అన్నారు. ఆదివారం నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని రెవెన్యూ కల్యాణ మండపంలో ఏఐఎఫ్‌టీయూ జిల్లా సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా గణేష్ పండా హాజరై మాట్లాడుతూ.. బ్రిటీష్ కాలంలోనే పోరాడి సాధించుకున్న కార్మికుల హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాసే ప్రయత్నాలు చేస్తుందన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లను పరిశ్రమల యాజమాన్యాలకు అనుకూలంగా చేసిందన్నారు. ఎనిమిది గంటల పనిదినాలను 13 గంటలకు పెంచి కార్మికులను మరింత దోపిడీకి గురి చేస్తున్నారని అన్నారు. నాలుగు వేల కోట్లతో ప్రారంభమైన విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించకుండా ప్రభుత్వాలు ఆపేశాయని, ఈ తప్పును కార్మికుల మీదకు నెట్టేస్తున్నాయని పేర్కొన్నారు. రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సింహాద్రి ఝాన్సీ మాట్లాడుతూ.. ఉత్తరాంధ్రలో జూట్, చక్కెర కర్మాగారా లను మూసివేయడం ద్వారా కార్మికులకు పనులు లేకుండా పోతున్నాయన్నారు. రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడం లేదన్నారు. ఈ సదస్సులో విజయదుర్గా ఆటోవర్కర్స్ యూనియన్ కార్యదర్శి నారాయణరావు, కార్మికులు ఎ.అప్పారావు, దంతులూరి వర్మ, శ్రీనునాయుడు, అప్పలరాజు రెడ్డి, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

తాటిపూడిలో పర్యాటకుల సందడి


రిజర్వాయర్ వద్ద పర్యాటకుల రద్దీ

గంట్యాడ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తాటిపూడి రిజర్వాయర్ సందర్శకులతో కిటకిటలాడింది. కార్తీక మాసంతో పాటు ఆదివారం కావడంతో జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుంచి పర్యాటకులు ఎక్కువ సంఖ్యలో వచ్చారు. రిజర్వాయర్‌ను తిలకించి బోటు షికారు చేశారు. ఆట పాటలతో సందడి చేశారు. అనంతరం సామూహిక భోజనాలు చేశారు.

భక్తిశ్రద్ధలతో పడిపూజ


పడిపూజ చేస్తున్న దృశ్యం

రాజాం రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాజాంలోని శాస్తాసమాజం విశ్వనాథ గురునిలయంలో ఆదివారం రాత్రి పడిపూజ (18 మెట్లు) ఘనంగా నిర్వహించారు. శాస్తాసమాజం పీఠాధిపతి ఉమాపతిశేష గురుస్వామి సారథ్యంలో వేదపండితులు చంటిస్వామి, రాజుస్వామి తదితరుల ఆధ్వర్యంలో పడిపూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన వందలాది మంది అయ్యప్ప దీక్షాధరులు పాల్గొన్నారు.


ఎస్ఎఫ్ఐ రాజాం మండలం నూతన కార్యవర్గం ఇదే

విద్యారంగ సమస్యలపై పోరాడుతాం

- ఎస్ఎఫ్ఐ మహాసభలో నేతలు
- నూతన కార్యవర్గం ఎన్నిక

రాజాం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలపై పోరాటాలకు స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ) ఎప్పుడూ ముందుంటుందని జిల్లా కార్యదర్శి వెంకటేష్, పలువురు నేతలు అన్నారు. పట్టణంలో ఆదివారం రాజాం మండల శాఖ ఎస్ఎఫ్ఐ మహాసభలు నిర్వహించారు. జిల్లా, మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు. సమస్యలపై సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంతభవనం ఉండాలని, జూనియర్ కళాశాలలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని, బీసీ బాలురు, బాలికలకు సొంత హాస్టల్ ఏర్పాటుతో పాటు భవనాలకు నిధులు మంజూరు చేయాలని తీర్మానం చేసి ఆమోదించారు. మండల ఎస్ఎఫ్ఐ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాజశేఖరం, కార్యదర్శిగా పి.రమేష్, ఉపాధ్యక్షుడిగా సాయి, సహాయ కార్యదర్శిగా షణ్ముఖతో పాటు పలువురు సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్ర మంలో పలు కళాశాలల విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు వసతి సమస్య

●కొన్ని నిర్మాణ దశలో.. మరికొన్ని భవనాలు అప్పగించక
●ఇబ్బంది పడుతున్న చిన్నారులు, నిర్వాహకులు

పాచిపెంట, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలు వసతి సమస్యతో కొట్టుమిట్టాడుతున్నాయి. దీంతో చిన్నారులు, నిర్వాహకులకు యాతన తప్పడం లేదు. కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. మరికొన్ని భవనాలు ఏళ్లతరబడి నిర్మాణ దశలోనే ఉన్నాయి. ఇంకొన్ని గ్రామాల్లో భవన నిర్మాణాలు పూర్తయినా బిల్లులు చెల్లించకపోవడంతో భవనాలను అప్పగించే పరిస్థితి లేదు. పాచిపెంట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 235 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 83 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు. ఈ ప్రాజెక్టు పరిధిలో 85 కేంద్రాలు అద్దె భవనాల్లో, మరో 20 ఇతర ప్రభుత్వ శాఖల భవనాల్లో కొనసాగుతున్నాయి.

వృథాగా భవనాలు

అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు మంజూరై నిర్మాణాలు పూర్తయినా బిల్లులు చెల్లించక పోవడంతో వృథాగా ఉన్నాయి. 2016-17 ఆర్థిక సంవత్సరంలో మండలానికి 5 భవనాలు మంజూరయ్యాయి. ఒక్కో భవన నిర్మాణానికి రూ. 7 లక్షలు కేటాయించారు. వాటితో పాటు ఉపాధి హామీ పథకం కింద రూ. 5 లక్షలు, స్త్రీశిశు సంక్షేమశాఖ ద్వారా రూ. 2 లక్షలు చొప్పున మంజూరయ్యాయి. ఈ నిధులతో పాచిపెంటలో రెండు అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు, అలాగే పాంచాళి, మోసూరు, మాతుమూరులో ఒక్కో భవనం చొప్పున నిర్మాణం చేపట్టారు. అయితే భవన నిర్మాణాలు పూర్తయినప్పటికీ బిల్లులు చెల్లించక పోవడంతో వాటిని కాంట్రాక్టర్లు అప్పగించలేదు. ఇదిలా ఉండగా రెండేళ్ల కిందట నవంబరులో నాడు-నేడు రెండో ఫేజ్ కింద 25 అంగన్‌వాడీ భవనాలు మంజూరయ్యాయి. ఒక్కొ భవనానికి రూ. 11.50 లక్షలు నిధులు మంజూరయ్యాయి. అయితే నిధులు 15 శాతం మాత్రమే విడుదల కావడంతో వివిధ దశల్లో నిలిచి ఉన్నాయి.

ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టాం..

అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు వసతి సమస్యను ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టాం. పూర్తయిన భవనాలను త్వరలో ప్రారంభిస్తాం. వసతి సమస్య లేకుండా చూస్తాం.

-అనంతలక్ష్మి ఐసీడీఎస్ పీవో, పాచిపెంట


పాచిపెంటలో తుప్పల మధ్య నిరుపయోగంగా భవనం

నెలలు నిండకున్నా.. కనుపాపలై వెలగాలి

(ఐదో పేజీ తరువాయి)

గంటలోపు అన్ని వసతులున్న ఆసుపత్రిలో వైద్యసేవలు అందించగలిగితే త్వరితగతిన కోలుకునే అవకాశాలున్నాయి. రాన్రాను సాధారణ పిల్లల మాదిరిగా ఎదిగే సామర్థ్యాన్ని సమకూర్చుకోగలుగుతారు. ప్రధానంగా నెలలు నిండకుండా పుట్టిన బిడ్డల్లో ఊపిరితిత్తులు, గుండె, మెదడు, నాడీవ్యవస్థ, జీర్ణవ్యవస్థలు పూర్తిగా ఎదగవు. ఇలాంటి పరిస్థితుల్లో పుట్టిన వెంటనే వెంటిలేటర్ సహాయంతో కృత్రిమశ్వాసను అందించాలి. నాడీవ్యవస్థను మెరుగుపరిచేందుకు ఇంక్యుబేటర్ సహాయంతో కృత్రిమ వెచ్చదనాన్ని అందించాలి. పూర్తిస్థాయి ఆరోగ్యం సమకూరేంత వరకు ఆసుపత్రిలో వైద్యుల పర్యవేక్షణలోనే ఉంచాలి.

కంగారూ మదర్‌కేర్ అవసరం..

పుట్టినప్పుడు రెండున్నర కిలోల కన్నా తక్కువ బరువున్న శిశువులకు ప్రత్యేకశ్రద్ధ అవసరం. కొంతమంది చిన్నారులు కిలో కన్నా తక్కువ బరువుతో పుడతారు. ఇలాంటి చిన్నారులకు కంగారూ మదర్ కేర్ చాలా అవసరం. కంగారూ జంతువు ఎలాగైతే తన ఒంటికి హత్తుకుని తన బిడ్డను సంరక్షించుకుంటుందో అదే పద్ధతిలో తల్లీబిడ్డల శరీరాలు ఒకరికి ఒకరు తగిలేలా తల్లి స్పర్శను బిడ్డకు అందివ్వగలగాలి. తద్వారా బిడ్డ ఎదుగుదలకు చాలా అవకాశాలున్నాయి.

జాగ్రత్తలు అవసరం..

అనారోగ్య సమస్యలున్న గర్భిణులు ఆరోవారం నుంచే అప్రమత్తంగా ఉండాలి. మొదటి ప్రసవం 24 వారాలకు జరిగిపోతే రెండో ప్రసవం అంతకన్నా రెండు వారాలకు ముందే జరిగే అవకాశాలున్నాయి. ఈ కోవకు చెందిన తల్లులు ముందస్తుగా ఆసుపత్రుల్లో చేరాలి. పుట్టిన పిల్లలకు ఆముదం తాగించకూడదు.. పసరమందులు వేయకూడదు. పల్చని పొడిగా ఉన్న దుస్తులు వేయాలి. స్నానం సమయంలో సుగంధ ద్రవ్యాలు వాడకూడదు. తల్లిపాలు తాగించాలి. బాలింతలు పత్యం జోలికి పోకూడదు. వైద్యుల సూచనలు, సలహాలు విధిగా పాటించాలి.

-ఆర్.భారతి, గైనకాలజిస్ట్, పాలకొండ ఏరియా ఆసుపత్రి

మెరుగైన వైద్య సేవలు..

జిల్లాకేంద్రాసుపత్రిలో ప్రతినెలా ప్రీ మెచ్యూరిటీ బేబీ కేసులు 280 వరకు నమోదవుతున్నాయి. నెలలు నిండకుండా పుట్టిన శిశువులకు మెరుగైన వైద్య సేలు అందిస్తున్నాం. ఇందుకోసం ఆసుపత్రిలో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేశాం. తల్లీబిడ్డ క్షేమంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం.

-నాగభూషణరావు, డీసీహెచ్, పార్వతీపురం మన్యం

ఆ కార్డుల రద్దుకు రంగం సిద్ధం!

(ఐదో పేజీ తరువాయి)

ఉన్నట్లు తెలుస్తోంది. ఏదేమైనా తక్షణమే రేషన్‌కార్డుల ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేసి అనర్హుల లెక్క తేల్చాలని జిల్లావాసులు కోరుతున్నారు. దీనిపై డీఎస్‌వో బాల సరస్వతిని వివరణ కోరగా.. 'ఈ నెలాఖరులోగా రేషన్‌కార్డుల ఈకేవైసీ పూర్తిచేస్తాం. ఇందులో కొంత మంది మృతులు , మరికొంతమంది వలస వెళ్లిన వారున్నారు. ఏదేమైనా ఈకేవైసీ ప్రక్రియ త్వరగా పూర్తిచేయాలని సిబ్బందిని ఆదేశించాం.' అని తెలిపారు.

కూలితేగానీ కదలరా?

(ఐదో పేజీ తరువాయి)

లంబగూడ, గెద్దకోల గ్రామాలకు చెందిన గిరిజనులు కోరుతున్నారు. దీనిపై ప్రాజెక్ట్ ఇంప్లిమెంట్ యూనిట్ (పీఐయూ) డీఈఈ ఎస్.రాధారాణిని వివరణ కోరగా.. 'అంటికొండకు వెళ్లే మార్గంలో గెద్దకోల-కురసింగి గ్రామాల మధ్య ఉన్న వంతెనను పరిశీలించాం. వంతెన శిథిలావస్థలో లేదు. త్వరలోనే రక్షణ గోడ నిర్మిస్తాం. సామరెల్లి- అంటి కొండవరకు 3.8 కిలోమీటర్ల మేర బీటీ రహదారి నిర్మాణానికి రూ.1.75కోట్లు మంజూరయ్యాయి. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయి.' అని తెలిపారు.

బోటు షికారు ఎప్పుడు?

(ఐదో పేజీ తరువాయి)

డెక్క నడుమ చిక్కుకున్నాయి. ప్రస్తుతం పరిస్థితి అనుకూలంగా ఉన్న నేపథ్యంలో ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పర్యా టకులు కోరుతున్నారు. దీనిపై పార్వతీపురం ఐటీడీఏ జేఈఈ తిరుపతిరావును వివరణ కోరగా.. 'తోటపల్లి ప్రాజెక్టు పరిధిలో బోటు షికారు ప్రారంభించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. గుర్రపు డెక్కను తొలగించడంతో పాటు రెండు బోట్లు, జట్టీలకు మరమ్మతులు చేయిస్తాం. తాటిపూడి తరలించిన మూడు బోట్లును తిరిగి రప్పిస్తాం. కుడి మట్టికట్ట ప్రాంతంలో నదీ ప్రాంతాన్ని వీక్షించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం.' అని తెలిపారు.

ప్రభుత్వ భూములను కాపాడండి

పాలకొండ, నవంబర్ 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కాపాడాలని సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బుడితి అప్పలనాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని డీసీఎంఎస్ స్థలంలో కబ్జాలకు జరుగుతున్న ఏర్పాట్లను మండల కార్యదర్శి ద్వారపూడి అప్పలనాయుడు, సామాజిక కార్యకర్త దుంపల రమేశ్‌బాబుతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పలువురు స్థానిక ప్రతినిధులు ప్రోత్సాహంతో అక్రమ కట్టడాలు జరుగుతున్నాయన్నారు. విశ్రాంత తహసీల్దార్ల సంతకాలతో ఫేక్ పట్టాలు తయారు చేసి విక్రయిస్తున్నారని ఆయన ఆరోపించారు.

గ్రంథాలయ ఉద్యమకారులకు నివాళి

సాలూరు, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం గ్రంథాలయ ఉద్యమకారులకు నివాళులర్పించారు. లైబ్రేరియన్ రాధాదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రంథాలయ ఉద్యమానికి చేసిన సేవలను విద్యార్థులకు వివరించారు. అనంతరం డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు.

●సీతంపేట రూరల్: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక గ్రంథాలయ శాఖలో ఉద్యమకారులకు నివాళులర్పించారు. గ్రంథాలయ ఉద్యమకారులు ఆచార్య ఎస్.ఆర్. రంగనాథన్, అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటాలకు గ్రంథాలయాధికారి గణేష్‌బాబు పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ సహాయకుడు రామకృష్ణ, శ్రీరాములు పాల్గొన్నారు.

●గరుగుబిల్లి: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం జాతీ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ ఉద్యమకారుకు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకుడు నల్ల మధుసూదనరావు పాల్గొన్నారు.

జర్నలిస్టులు నిర్మాణాత్మక పాత్ర పోషించాలి

ఒడిశా

రాయగడ, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులు సమాజం లో నిర్మాణాత్మక పాత్ర పోషించి సమాజ ప్రగతికి పాటుపడాలని ఎమ్మెల్యే అప్పలస్వామి కద్రక అన్నారు. ఆదివారం జాతీయ పాత్రికేయుల దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ సమా వేశ మందిరంలో సమాచార ప్రజా సంబంధాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మా ట్లాడారు. పాత్రికేయులు ప్రభుత్వానికి, ప్రజలకు వారధిలా పనిచే స్తున్నారన్నారు. పాత్రికేయుల సమస్యలపై అసెంబ్లీతో చర్చిస్తానని హమీ ఇచ్చారు. జిల్లా ప్రజాసంబంధాల అధికారి బసంతకుమార్ ప్రధాన్ మాట్లాడుతూ ఈ ఏడాది జిల్లాలో 300 మంది పాత్రికేయుల కు గోపబంధు ఆరోగ్యబీమా పథకం వర్తింపజేశామన్నారు. కార్య క్రమంలో అదనపు కలెక్టర్ నవీన్‌చంద్ర నాయక్, జడ్పీ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, ఉత్కళ అల్యూమినా పరిశ్రమ పీఆర్‌వో మహమ్మద్, పాత్రికేయులు పాల్గొన్నారు.

కోటదుర్గమ్మను తాకిన సూర్య కిరణాలు

పాలకొండ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఆరాధ్యదైవం కోటదుర్గమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారి విగ్రహానికి సూర్య కిరణాలు తాకాయి. సూర్య కిరణాలు తొలిసారి అమ్మవారి తాకడంతో ఈ అద్భుతాన్ని చూసేందుకు భక్తులు పోటీ పడ్డారు. ఆలయ ప్రధాన అర్చకుడు దార్లపూడి లక్ష్మీ ప్రసాదశర్మ, ఆలయ ఈవో వి.వి.సూర్యనారాయణ ప్రత్యేక పూజలు నిర్వహించారు.


సూర్యకిరణాల వెలుగులో అమ్మవారు

కళింగ వైశ్యుల సేవలు ఆదర్శప్రాయం

పార్వతీపురం రూరల్, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): కళింగ వైశ్యుల ఆర్థిక, సామాజిక, ఆధ్యాత్మిక సేవలు అందరికీ ఆదర్శప్రాయమని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. ఆదివారం సీతారాంపురం మామిడితోటలో నిర్వహించిన కళింగ వైశ్యుల వన సమారాధనకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళింగ వైశ్యులు నిర్వహించే కార్యక్రమాలు వారి సామాజిక బాధ్యతను వెల్లడిస్తున్నాయన్నారు. వారు వ్యాపారాలు వారు చేస్తూ మిగిలిన సమయాన్ని ఆధ్యాత్మిక, సామాజిక సేవలో గడపడం వారికే చెల్లిందన్నారు. పండగ వాతావరణాన్ని తలపించేలా వన సమారాధన నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా కళింగ వైశ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర

బిర్సాముండా జయంతిలో ఎమ్మెల్యే జయకృష్ణ

పాలకొండ, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం బిర్సా ముండా 150వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఒడిశా ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ పాల్గొన్నారు. అనంతరం లగిశపల్లిలో విగ్రహావిష్కరలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.


విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే జయకృష్ణ

సందడిగా శిష్టకరణ వనభోజనాలు

పాలకొండ, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): అన్నవరం తోటల్లో శిష్టకరణ సంక్షేమ సేవా సంఘం వనభోజన కార్యక్రమాన్ని ఆదివారం సందడిగా నిర్వహించింది. చిన్నారులు, మహిళలు ఆట పాటలతో ఉత్సాహంగా గడిపారు. విజేతలకు రాజాం వైభవ్ సంస్థ సమకూర్చిన బహుమతులను సేవా సంఘం అధ్యక్షుడు భాసూరు శ్రీధర్, ప్రధాన కార్యదర్శి ఎస్. శ్రీనివాసరావుతో పాటు కార్యవర్గ సభ్యులు పంపిణీ చేశారు. అలాగే పట్టణంలోని డాక్టర్ సి.ఎల్.నాయుడు తోటలో దేవాంగకుల ఆత్మీయ వన భోజనం మహోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో చిన్న పిల్లల వైద్యుడు రవీంద్రకుమార్ పాల్గొన్నారు.


మ్యూజికల్ చైర్ ఆడుతున్న మహిళలు

భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు

భామిని, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): భామినిలోని మదన కామేశ్వర ఆలయ ప్రాంగణంలో ఆదివారం లక్ష్మీగణపతి యాగాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగాద మహిళలు సామూహిక కుంకుమపూజలు చేపట్టారు. వేద పండితులు గుడివాడ శ్రీనివాసరావు, రంపా లలిత ప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.


పూజలు నిర్వహిస్తున్న మహిళలు

విద్యార్థులకు క్రీడా దుస్తులు

మక్కువ రూరల్, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): ఎ.వెంకంపేట జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన క్రీడాకారులకు అదే పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు క్రీడా దుస్తులను ఆదివారం వితరణ చేశారు. పూర్వ విద్యార్థులు భవిరిపూడి శ్రీను, లచ్చిపాత్రుని రామ.. విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులకు హెచ్ఎం దేవి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పీఈటీ పరశురాం పాల్గొన్నారు.

కొఠియా సమస్యపై ఆలోచించండి

●ఒడిశా ముఖ్యమంత్రిని కోరిన మంత్రి సంధ్యారాణి

సాలూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర-ఒడిశా రాష్ట్రాల వివాదాస్పద 21 కొఠియా గ్రామాల సమస్య పరిష్కారం దిశగా ఆలోచన చేయాలని ఒడిశా ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝీని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి కోరారు. ఆదివారం పాడేరులో భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఆయనతో మంత్రి నేరుగా కలిసి మాట్లాడారు. సమస్యను పరిష్కరించాలని కోరినట్టు స్థానిక విలేకరులకు ఆమె ఫోన్‌లో తెలిపారు. ఆయా గ్రామాల వారు పడుతున్న ఇబ్బందులను రాష్ట్ర ప్రభుత్వం వారికి కల్పిస్తున్న సౌకర్యాలను వివరించినట్టు ఆమె తెలిపారు.


ఒడిశా సీఎంతో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

ఘనంగా సహస్ర జ్యోతిర్లింగార్చన

పాలకొండ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నక్కలపేటలోని అమృత మృత్యుంజయ ఆలయంలోని మరకత శివలింగం వద్ద ఆదివారం ఆలయ అర్చకుడు పత్రి శరత్‌కుమార్ ఆధ్వర్యంలో సహస్ర జ్యోతిర్లింగార్చనను ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త పల్లా కొండలరావు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


దీపారాధనలో భక్తులు

మళ్లీ వచ్చిన ఏనుగులు

కొమరాడ, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): బిత్రపాడు గ్రామ పరిధిలో ఉన్న ఏనుగులు గుంపు నాగావళి నది దాటి ఆదివారం ఉదయానికి సోమినాయుడు వలస వద్ద రైల్వేలైన్ దాటి ఆర్తాం కొండల్లోకి మళ్లీ ప్రవేశించాయి. గత వారమే ఈ ప్రాంతంలో సంచరించిన ఏనుగులు గుంపు మళ్లీ రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గురువారం సాయం త్రానికి అంకులవలసు సమీపంలో వరి పంట పొలాల్లో ఏనుగులు గుంపు సంచరిస్తోంది. కుమ్మరిగుంట, సోమినాయడువలస గ్రామాల పరిధిలో కాయగూరలు, వరి, అరటి పంటలు ఎక్కువగా పండిస్తుండడంతో ఈ ప్రాంతాల్లో ఏనుగులు గుంపు సంచరిస్తోంది. పంటకు తీవ్ర నష్టం జరుగుతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు.


సంచరిస్తున్న ఏనుగులు

పంచాయతీరాజ్ ఇంజనీర్ల కార్యవర్గం ఎన్నిక

పార్వతీపురం, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ ఇంజనీర్ల జిల్లా అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక ఆదివారం ఏకగ్రీవంగా జరిగింది. స్థానిక ఎన్‌జీవో హోమ్‌లో నిర్వహించిన ఎన్నికకు ఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు జి.వి.ఆర్.ఎస్.కిశోర్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడిగా కె.సంజీవరావు, జనరల్ సెక్రటరీగా గంట చంద్రమౌళి, ట్రెజరర్‌గా డబ్ల్యూవీఎస్ఎస్ శర్మ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా వి.మౌనిక ఎన్నికయ్యారు. ఎన్నికైన కార్యవర్గం మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు నివాళులర్పించి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు సంజీవరావు మాట్లాడుతూ అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్య క్రమంలో పాలకొండ, పార్వతీపురం పంచాయతీరాజ్ విభాగం ఇంజనీరింగ్ అధికారులతో పాటు సురేష్ తదితరులు పాల్గొన్నారు.


ఎన్నికైన నూతన కార్యవర్గం

వీరఘట్టంలో అన్న సంతర్పణ

వీరఘట్టం, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టం హరిహరాత్మజ నిలయం ప్రతిష్ఠోత్సవం ముగింపు సందర్భంగా ఆదివారం మహా అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వీరఘట్టంతో పాటు పరిసర గ్రామాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి అయ్యప్పస్వామిని దర్శించుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు అన్న ప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా స్వామి అయ్యప్ప అసోసియేషన్ ఏర్పాట్లు చేసింది.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థినుల ఎంపిక

గరుగుబిల్లి, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని డాక్టర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థినులు స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్ పోటీలకు ఎంపియ్యారని ప్రిన్సిపాల్ ఎ.రజనీకుమారి తెలిపారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి జాతీయస్థాయిలో మొదటి 100 స్థానాల్లో విద్యార్థినులు ఇందుమతి, శ్రావణి, సీహెచ్.ఇందు ఎంపికయ్యారన్నారు. ఫ్లోరల్ కార్ప్ ప్రాజెక్టులో ప్రతిభ కనబరిచారని అటల్ ఇన్నోవేషన్ మిషన్ నుంచి సమాచారం వచ్చిందన్నారు. ఎంపికైన విద్యార్థినులకు ఈ నెల 17 నుంచి 21 వరకు ప్రత్యేక శిక్షణ అందజేస్తామన్నారు. ఎంపికైన విద్యార్థినులను డీఈవో బి.రాజ్‌కుమార్, సర్వశిక్ష ఏపీసీ ఆర్.తేజేశ్వరరావు, జిల్లా సైన్స్ అధికారి జి.లక్ష్మణరావు, ఉపాధ్యాయులు ఝాన్సీ ప్రియదర్శిని అభినందించారు.

రాజగోపురం నిర్మాణానికి దాతల సహకారం

గరుగుబిల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి దేవస్థానం పరిధిలో రాజగోపురం నిర్మాణానికి పలువురు దాతలు ముందుకు వచ్చారని దేవస్థానం అభివృద్ధి సేవా ట్రస్ట్ ప్రతినిధి ఎం.వాసుదేవరావు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజగోపురం పైభాగంలోని విగ్రహాల ఏర్పాటుకు దాతలు పెదగుడబ గ్రామానికి చెందిన కందిశ శ్రీహరి, శ్రీలేఖ దంపతులు, పాలకొండకు చెందిన ఎ.భాగ్యేశ్వరరావు కుటుంబ సభ్యులు రూ. 12 వేలు విరాళంగా అందించారన్నారు. ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని ఆయన కోరారు.

బస్సు ఎక్కబోయి జారిపడిన ప్రయాణికుడు

●నుజ్జయిన కాలు, ఆసుపత్రిలో చికిత్స

బెలగాం, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికుడి కాలిపై నుంచి బస్సు టైరు వెళ్లడంతో కాలు నుజ్జయిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. విశాఖపట్నం వెళ్లే ఆర్టీసీ బస్సు పాయింట్‌లో పెడుతుండగా ఈ ప్రమాదం జరిగిందని ఆర్టీసీ సిబ్బంది తెలిపారు. ప్రయాణికులు ఎక్కువగా ఉండడంతో బస్సు పాయింట్‌లో పెట్టకముందే బస్సు ఎక్కేందుకు ప్రయాణికులు ఎగబడ్డారు. ఈ సందర్భంగా తెర్లాం మండలం గంగవల గ్రామానికి చెందిన జె.వెంకటరావు బస్సు ఎక్కుతూ కింద జారి పడ్డాడు. దాంతో ఆయన కాలిపై నుంచి బస్సు చక్రం వెళ్లింది. దీంతో కాలి పాదం నుజ్జునుజ్జయింది. వెంటనే క్షతగాత్రుడిని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి 108లో తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం విజయనగరం ఆసుపత్రికి వైద్యులు రిఫర్ చేశారు.


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వెంకటరావు

నమూనా పరీక్షకు 335 మంది హాజరు

వీరఘట్టం, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీఉన్నత పాఠశాలలో ఆదివారం ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జవహర్ నవోదయ నమూనా ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు నియోజకవర్గ వ్యాప్తంగా 335 మంది విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు మజ్జి పైడిరాజు, కురమాన గోవిందరావు, సూరి సతీష్, బి.వాసుదేవరావు, దుర్గా ప్రసాద్, గోవిందరావు పాల్గొన్నారు

చిలకాంలో గాయత్రీ మహాయజ్ఞం

గరుగుబిల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): చిలకాంలో నవ కుండీల గాయత్రి మహాయజ్ఞాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ఆధ్యాత్మిక వేత్త కంచుమోజు రామ్మోహనరావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా భాగవత పారాయణం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భక్తిమార్గం వైపు ప్రజలు పయనించాలన్నారు. చెడు వ్యసనాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలన్నారు. వ్యక్తి నిర్మాణం దైవ చింతనతోనే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ఎం.కాశీస్వామి, కొమరాడ ఎంఈవో జె.నారాయణస్వామి, ఎంపీటీసీ సభ్యులు ద్వారపురెడ్డి సత్యనారాయణ, వెంకటనాయుడు, మాజీ ఎంపీపీ డి.గౌరమ్మ, ప్రధానోపాధ్యాయుడు మర్రాపు మహేశ్‌తో పాటు పాలకొండ కౌన్సిలర్ టి.శంకరరావు పాల్గొన్నారు.


మహా యజ్ఞం నిర్వహిస్తున్న పండితులు

ఎన్నాళ్లిలా?

●నిధులున్నా.. వెంటాడుతున్న స్థల సమస్య
●పరాయిపంచనే మండల విద్యావనరుల కార్యాలయం


ఇరుకుగదిలో విధులు నిర్వహిస్తున్న ఎంఈవో, సిబ్బంది (ఫైల్)

సీతంపేట రూరల్, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): సీతంపేట మండల విద్యా వనరుల కేంద్రం భవన నిర్మాణానికి స్థల సమస్య వెంటాడుతోంది. గతంలో విద్యా వనరుల కేంద్రానికి పక్కా భవనం ఉన్నప్పటికీ ఆ స్థలంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం జరుగుతోంది. ఆసుపత్రి భవన నిర్మాణంలో భాగంగా అక్కడ కార్యాలయాన్ని ఏడాదిన్నర కిందట ఖాళీ చేశారు. ప్రస్తుతానికి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నతపాఠశాల భవనంలో మండల విద్యా వనరుల కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. గది చిన్నది కావడంతో కార్యాలయ నిర్వహణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో మండల విద్యా వనరుల కేంద్రం భవ నిర్మాణానికి సమగ్ర శిక్ష నుంచి మూడు నెలల కిందట రూ.53 లక్షలు మంజూరయ్యాయి. అయితే భవన నిర్మాణం చేపట్టేందుకు స్థలం కరువైంది.

ఈ విషయం ఎంఈవో ఆనందరావు వద్ద ప్రస్తావించగా.. కార్యాలయ భవన నిర్మాణానికి నిధులు మంజూరైన మాట వాస్తమేనన్నారు. అయితే భవ నిర్మాణానికి స్థల సమస్య ఉందన్నారు. స్థలం కేటాయించాలని ఐటీడీఏ పీవో, తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశామన్నారు. అయినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. మంజూరైన నిధులు నాలుగు నెలల్లో ఖర్చుచేయకుంటే వెనక్కి మళ్లే అవకాశం ఉందన్నారు.